నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, సోమవారం 15 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

## ధాన్యాన్ని కేంద్రాల్లోనే విక్రయించాలి

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ముథోల్, ఏప్రిల్ 14 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రైతులకు సూచించారు. ఆదివారం బోరిగాం, ఎడ్‌బిడ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు 17 శాతం తేమ కలిగి ఉం డేలా చూసుకోవాలన్నారు. తూకం లో 40 కి లోల 580 గ్రాముల ధాన్యాన్ని తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గన్నీ సంచులతోపా టు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్, డీఏవో అంజీప్రసాద్, డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, ఏవో భాస్క ర్, పీఏసీఎస్ సీఈవో సాయారెడ్డి ఉన్నారు.

# బీఆర్‌ఎస్‌దే విజయం




- ప్రచారంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తాం..
- పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించే సత్తా గులాబీకే ఉంది..
- బీజేపీ సిద్ధాంతాలను కాదని బీఆర్‌ఎస్ నాయకుడికి టికెట్ ఇచ్చారు..
- బీజేపీ పదేళ్ల పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్రనష్టం
- కాంగ్రెస్ నాలుగు నెలల పాలన నమ్మక ద్రోహంగా మారింది..
- 'నమస్తే' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురుతుందని బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రచారంలో పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తామని, పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించే సత్తా కేవలం బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. బీజేపీ తమ పార్టీ అభ్యర్థులను కాదని, సిద్ధాంతాలను పక్కన పెట్టి బీఆర్‌ఎస్ నాయకుడికి టికెట్ ఇచ్చిందన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జిల్లావాసులు బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రయోజనం చేకూరలేదని తెలిపారు. ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం, ఎయిర్‌పోర్టు నిర్మాణం, నవోదయ పాఠశాలల ఏర్పాటు, గిరిజన యూనివర్శిటీ ఏర్పాటుతోపాటు ఇతర అంశాలపై కేంద్రంలో కనీస స్పందన లేదన్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన మోదీ ఏ ఒక్క విషయంలో మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో గిరిజనుల అభివృద్ధి, సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేసిందని తెలిపారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలన నమ్మకద్రోహంగా మారిందని 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**నమస్తే తెలంగాణ : విజయం సాధించడానికి ఎలాంటి ప్రణాళికలు అమలు చేయనున్నారు?**

అత్రం సక్కు: ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి సాధించింది. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, పింఛన్లు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ వంటి పథకాలను అమలు చేసి రైతులు, పేదల జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రతి ఇంటికీ మూడు నుంచి ఏడు పథకాలు అందాయి. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తెలియజేసి ఓట్లు అడుగుతాం. పార్లమెంట్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణ గొంతు ఎత్తే దమ్ములేదు. తెలంగాణ హక్కుల సాధన, ప్రజల సమస్యల పరిష్కారానికి కేవలం బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమే ప్రజల గొంతును వినిపిస్తారు.

**నమస్తే : ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?**

సక్కు: పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు, 52 మండలాలు, 2,111 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం ఇప్పటికే జరుగుతుండగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేపు జిల్లా పర్యటనకు రానున్నారు. ఆదిలాబాద్‌లో నిర్వహించే పోలింగ్ బూత్ నాయకుల సమావేశంలో పార్టీ విజయం సాధించడానికి ఎలా ముందుకెళ్లాలనే విషయాలపై దిశానిర్దేశం చేస్తారు. 17 నుంచి బూత్ స్థాయి మండల, గ్రామస్థాయి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారు. కేసీఆర్‌తో పాటు ఇతర నాయకుల పర్యటనలు ఉంటాయి.

**నమస్తే : బీజేపీ పరిస్థితి ఏమిటీ?**

సక్కు : బీజేపీ సిద్ధాంతాలు కలిగిన పార్టీ అని అంటారు. ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుతోపాటు పలువురు నాయకులు ఎంపీ టికెట్ ఆశించారు. వారి గెలిచే అవకాశాలు లేకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకుడిని పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే, ఎలాంటి ఫలితం లేదు. జిల్లా అభివృద్ధిపై కమలం పార్టీకి చిత్తశుద్ధి లేదు. పదేళ్ల బీజేపీ పాలనలో జిల్లాకు తీవ్ర నష్టం జరిగింది. అభివృద్ధిని పక్కన పెట్టి కేవలం మతం, మందిరాల పేరిట ప్రజలను మభ్యపెట్టే బీజేపీని ప్రజలు నమ్మే ప్రసక్తి లేదు.

**నమస్తే : ఆరు గ్యారెంటీతో కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నది. ప్రజలు ఓట్లు వేస్తారా?**

సక్కు : అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరు చెప్పి కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి పాల్పడింది. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గృహజ్యోతి అర్హులైన వారందరికీ చేరడం లేదు. రూ.500 సిలిండర్ ఎవరికీ రావడం లేదు. రూ.2 లక్షల రుణం మాఫీ లేదు. సాగునీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మంత్రులు, ఆ పార్టీ నాయకులు పరమర్శించినా పాపాన పోలేదు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనల్లో పల్లెల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పాత హామీలను పక్కన పెట్టిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల్లో కొత్తగా మ్యానిఫెస్టోను రాహుల్‌గాంధీతో విడుదల చేయించింది. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు.

**నమస్తే : గిరిజనుల ఓట్లు అధికంగా ఉన్నాయి. ఏ పార్టీకి వారు అండగా ఉంటారు?**

సక్కు : ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు పంపిణీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకం అందజేశారు. మారుమూల ఆదివాసీ గూడేలకు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించారు.దండారీ వేడుకలకు యేటా రూ.కోటి అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.25 కోట్లతో జోడేఘాట్‌ను అభివృద్ధి చేసింది. జంగుబాయి, కేస్లాపూర్ నాగోబా, ఇతర ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద గిరిజనులు నివాళులు అర్పించే అవకాశం కల్పించింది. గిరిజనుల రిజర్వేషన్లను పెంచింది. నేను రెండు సార్లు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గిరిజనుల సమస్యలను ప్రస్తావించి పరిష్కారం అయ్యేలా చూశా. వ్యక్తిగతంగా వారి సంస్కృతీ సంప్రదాయాల్లో చురుకుగా పాల్గొంటాను. ఈ ఎన్నికల్లో వారు బీఆర్‌ఎస్‌కు అండగా నిలువనున్నారు.

**నమస్తే : కార్యకార్తలకు ఎలాంటి సూచనలు చేస్తారు?**

సక్కు : పార్టీ విజయంలో కార్యకర్తలు పాత్ర కీలకం. అభ్యర్థి గెలుపు, ఓటములపై వారి పనితీరు ప్రభావం చూపుతుంది. బీఆర్‌ఎస్ ఉన్న కార్యకర్తలు ఏ పార్టీకీ లేరు. ఈ ఎన్నికల కదనరంగంలో వారు సైనికుల మాదిరి పనిచేసి నాకు విజయాన్ని అందించనున్నారు. మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను తయారు చేసే కర్మాగారం. కొందరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారు. నాయకులు పోయినా కార్యకర్తలు పార్టీతో నడుస్తున్నారు. ఎవరూ అధైర్యపడవద్దు, వారికి నేను అండగా ఉంటాను. ఎలాంటి సమస్య ఉన్న నన్ను కలిసి నేరుగా మాట్లాడవచ్చు.

## పల్లె పల్లెనా అంబేద్కర్ జయంతి


బోథ్ బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం


బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో.. మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా జరిగాయి. ప్రముఖులు ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచశీల జెండాలను కూడా ఆవిష్కరించారు. చిత్రపటాలను వాహనాల్లో పెట్టి ర్యాలీలు నిర్వహించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో గల బస్టాండ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గల విగ్రహానికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిర్మల్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.


ఇంద్రవెల్లి : మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


నిర్మల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


ఉట్నూర్ : శోభాయాత్ర నిర్వహిస్తున్న బౌద్ధ ఉపాసకులు

# సంక్షోభంలో బీడీ పరిశ్రమ

- పదేండ్లలో పనిదినాలు తగ్గింపు
- నెలకు 10 నుంచి 15 రోజులే..
- గిట్టుబాటు కాక ఆర్థిక ఇబ్బందులు
- పట్టించుకోని కేంద్ర సర్కార్
- బీడీ పెన్షన్‌తో ఆసరా


బీడీలు చుడుతున్న మహిళలు

**వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పిస్తున్న రంగం బీడీ పరిశ్రమ. కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాల్సిన కేంద్రం గండి కొడుతున్నది. ఆంక్షలు విధించడం, భద్రత కల్పించడంలో విఫలం కావడం, ప్రస్తుతం పని దినాలను కూడా కుదించడంతో మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోదీ పాలనలో బీడీ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని పేర్కొంటున్నారు. 28 రోజులు పని చేసిన కార్మికులు నేడు కేవలం 15-20 రోజులు మాత్రమే బీడీలు చుడుతున్నారు. 1000 బీడీలు చుడితే రూ.245 చెల్లిస్తున్నా.. ఆకు, తంబాకు నాణ్యతగా లేకపోవడంతో తరుగు ఏర్పడి కార్మికులే భరించుకోవల్సి వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తమ హక్కుల కోసం కొట్లాడితే ఉన్న ఉపాధికే ఎసరు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

### కార్మికులపై కేంద్రం చిన్నచూపు



బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్న ది. కేంద్ర కార్మిక శాఖ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెం చేలా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కానీ కార్మిక చట్టాలను బలహీన పరుస్తూ యాజమాన్యాలకు కొమ్ముకాసే విధంగా కార్మికశాఖ వ్యవరిస్తున్నది. పదేండ్లలో బీడీ పరిశ్రమ రోజురోజుకి తగ్గడం కార్మికులకు తీరని శాపం.

**-రాజన్న, బీడీ కార్మిక సంఘం నాయకులు.**

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 14 : నిర్మల్ జిల్లాలో సుమారు 80 వేల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారు. వీరంత చార్‌బాయి, దేశాయి, శివాజీ, ఎంఎం, వర్ది బీడీ కంపెనీల్లో కూలీలుగా పని చేస్తున్నారు. కార్మికులు 70వేలు ఉంటే.. మహిళా కార్మికులే 50 వేలు ఉంటారు. మిగతా వారిలో టేకేదారులు, చాటన్ కార్మికులు, మునీలు, బట్టి కార్మికులు, ప్యాకర్లు, డ్రైవర్లు, క్లీనర్‌లు ఉన్నారు. వీరందరికీ గతంలో 25 రోజులు పని ఉండడం వల్ల నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు వచ్చేవి. కానీ.. పనిదినాల కుదింపులో 12 రోజులకు మించి పని రావడం లేదని వారు పేర్కొంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేసేవారు. ఇప్పుడు 3 గంటలకే పని ముగించుకుని వెళ్తున్నారు.

### ప్రభుత్వ విధానాల వల్లనే..

బీడీ పరిశ్రమపై 2016లో కేంద్రం 28 శాతం జీఎస్టీ విధించడం, బీడీ కట్టలపై పుర్రె గుర్తు పెట్టడం, కార్మిక చట్టాలను బలహీన పర్చడం వంటి ఆంక్షలు విధించింది. యాజమాన్యాలకు కొమ్ముకాసే విధంగా కేంద్ర కార్మిక శాఖ వ్యవరించడంతో యాజమాన్యం ఆడిందే ఆట పా డిందే పాటగా వ్యవరిస్తున్నట్లు కార్మికులు తెలిపారు. పనిదినాలు పెంచి, వేతనాలు, కరువు భత్యం ఇతర సదుపాయాలు కల్పించాలని కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా బీడీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోక పోవడం బీడీ పరిశ్రమ ఉనికికే ప్రమాదం అని కార్మికులు, ఆ సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

### ఆదుకుంటున్న కేసీఆర్ పింఛన్

బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులకు కేసీఆర్ ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన బీడీ కార్మికుల పెన్షన్ ఆదుకుంటుంది. జిల్లాలో సుమారు 62, 310 మందికి ప్రతినెలా రూ.2,016 చెల్లిస్తున్నారు. టేకేదారులకు కూడా ప్రభు త్వం పింఛన్ అందిస్తున్నది. బీడీలు చుట్టడం ద్వా రా నెలకు రూ.2,500 పింఛన్‌గా రూ. 2,016లు కార్మికుల చేతికి వస్తున్నాయి. ఒకవేల పెన్షన్ రాకపోతే కేవ లం రూ. 2500ల తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతోనే బతుకుతున్నామ ని, అవికూడా రాకపోతే వేరే పని చూ సుకునేవారమని చెబుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, పాలకులు బీడీ కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### చేతినిండా పనిలేదు..



బీడీ పనిచేయడం తప్ప మా కు ఏపని రాదు. చిన్నప్పటి నుంచి దీని మీదనే ఆధారపడి జీవిస్తున్నాం. గతంలో నెలలో 25 రోజులు పని దొరికేది. ఇపుడు 15 రోజులు కూడా దొరుకడం లేదు. నెలంతా కష్టపడితే ప్రస్తుతం రూ.10 వేలు వస్తున్నవి. గతంలో రూ.15 వేల వరకు వచ్చేవి. ఖర్చులు పెరిగినయ్. పిల్లలను చదివించాలిచదివించాలి. ఇల్లు రెంటు, ఇంటి అవసరాలు, అనారోగ్యం ఏర్పడితే ఆసుపత్రి ఖర్చులు కూడా ఈ డబ్బులతోనే సరిపెట్టుకోవాలి. బీడీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి. చేతినిండా పని కల్పించాలి.

**-వాణి, కార్మికురాలు**

## నగదు పట్టివేత

బోథ్, ఏప్రిల్ 14 : ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ఆదివారం అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.85 వేలను పట్టుకున్నట్టు ఎస్సై రాము తెలిపారు. తనిఖీల్లో భాగంగా అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నగదును ఎఫ్‌ఎస్టీ బృందం సభ్యులకు అప్పగించామన్నారు. తనిఖీల్లో ఎఫ్‌ఎస్టీ బృందం సభ్యులు ప్రమోద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

ఎదులాపురం, ఏప్రిల్ 14 : అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతాయని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు పేర్కొన్నారు. వారోత్సవ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక శాఖ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్‌వో గోవర్ధన్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ పాల్గొన్నారు.

# ఇంకని జలం.. మేల్కొవాలి జనం..

- నిర్మల్ జిల్లా కావద్దు మరో బెంగళూరు
- భూగర్భ జలాల పెంపునకు దోహద పడుదాం..
- ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మిద్దాం..

దిలావర్‌పూర్, ఏప్రిల్ 14 : భూగర్భజలాల పెంపునకు ఇంకుడు గుంతలు చాలా అవసరం. ప్రతి ఇంటికీ వీటిని నిర్మించాలనే సదుద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నది. వీటిని మన ఇంటికి సమీపంలో నిర్మించుకుంటే భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాం. ఇప్పుడున్న బెంగళూరు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నది. అలాంటి మహానగరం నేడు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నది. కనీసం డబ్బులు పెట్టి వాటర్ బాటిల్స్ కొనుకుందామన్న దొరకని దుస్థితి. వేల రూపాయలు చెల్లించినా ట్యాంకర్లు దొరుకని పరిస్థితి. అలాంటి పరిస్థితి రాక ముందే మన నిర్మల్ జిల్లాలోని ప్రజలు మేల్కొంటే భవిష్యత్ తరాలకు కనీసం తాగునీరైనా అందించిన వారమవుతాం.

### కారణాలు అనేకం..

భూగర్భజలాలు అడుగంటడానికి ప్రధాన కారణం నీటి వినియోగం పొదుపుగా లేకపోవడం. వృథా నీటిని అరికట్టలేకపోవడం. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఇంటి నిర్మాణ సమయంలో ఇంటి చుట్టూ సీసీని ఏర్పాటు చేయడం వల్ల వృథా నీరు, వర్షపు నీరు వృథాగా పోతున్నది. దీని వల్ల భూగర్భజలాలు పడిపోయి తాగునీటి అవసరాలతోపాటు సాగునీటికి కూడా ఇబ్బందులు రానున్నాయి. ఇప్పటికే జిల్లాలో సాగునీటి కష్టాలు రైతులు చవిచూస్తున్నారు. చేతికందే దశలో ఉన్న పంటలకు భూగర్భజలాలు అడుగంటి సాగునీరు అందక ఎండిపోతున్నాయి.

### కానరాని ఇంటికో ఇంకుడు గుంత..

ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో మాత్రం ఇంకుడు గుంతలను ఏర్పా టు చేశారు. కానీ.. ఇంటి వద్ద మాత్రం ఇంకు డు గుంతలు కానరావడం లేదు. గతేడాది రికార్డుస్థాయిలో 5,940 ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ పనుల కోసం జిల్లాస్థాయి అధికారులు మొదలుకుని మండల స్థాయి అధికారులందరూ అన్ని కార్యాలయాల్లో నిర్మించుకున్నారు. ఈ నిర్మాణాలకు డీఆర్డీవో ఆధ్వర్యంలో ఉద్యమంలా చేపట్టారు. అదే విధంగా ఈ యేడాది కూడా 'క్యాచ్ ది రేయిన్' పేరిట కార్యక్రమం చేపట్టినప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు చేరడం లేదు.

### కచ్చితంగా నిర్మించుకోవాలి..

భూగర్భజలాలు అడుగంటకుండా ముందు చూపుతో నూతన భవనాలు నిర్మించుకునే వారు తప్పని సరిగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలనే ఆదేశాలను అధికారులు స్పష్టంగా అమలు చేస్తే లక్ష్యం చేరుకుంటాం. వర్షపు నీరు, ఇంటి అవసరాలకు వాడుకునే నీరు వృథాగా పోకుండా ఉండి తిరిగి రిచార్జ్ అవుతాయి. అందుకే మనం మేల్కొంటేనే మన భవిష్యత్ తరాలకు తాగు, సాగునీటి ఇబ్బందులు కలుగవు. లేదంటే నిర్మలమైన మన నిర్మల్ జిల్లా మరో బెంగళూర్ కాక తప్పదు మరి.


దిలావర్‌పూర్ ఈజీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

### పడిపోతున్న భూగర్భ జలాలు..

భూగర్భజలాలు పడిపోతున్నాయి. గత నెల ప్రస్తుత నెలతో పోలిస్తే ఒక మీటర్ లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. మార్చిలో 9.01 లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఏప్రిల్ నాటికి అవి 10.19 మీటర్ల లోతుకు పడిపోయాయి. తీవ్రమైన ఎండలతో నీటి వినియోగం పెరగడం కూడా కారణంగా చెప్పవచ్చు.

### పొదుపుగా వినియోగించుకోవాలి..



ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలి. ఉన్న నీటి వనరులను వృథా చేయకుండా ఉండాలి. మనం వాడుకున్న నీటిని తిరిగి మన ఇంటి పరిసర ప్రాంతంలో నిర్మించు కున్న ఇంకుడు గుంతలోకి వెళ్తే తిరిగి రీచార్జి అవుతాయి. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. దీనితోపాటు భూగర్భ జలాలు అడుగంటకుండా ఉంటాయి.

**- అజీజ్‌ఖాన్, ఎంపీవో, దిలావర్‌పూర్.**

### అవగాహన కల్పిస్తున్నాం..



ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గతేడాది రికార్డుస్థాయి లో ఐదు వేలకుపైగా ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మించాం గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తున్నాం. వీటిని ఏర్పాటు చేసుకోవడం వల్ల కలుగు లాభాలను గురించి వివరిస్తున్నాం. కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు తప్పని సరిగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి.

**- విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్**